నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 25 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

దశాబ్దాల అనుభవం కలిగిన సీనియర్ వైద్యులున్నరు.. నాడీ పట్టిన వెంటనే రోగ నిర్ధారణ చేయగల థీశాలులుగా పేరు గడించారు.. అయితేనేం..! వారందరికీ చేతినిండా పనిలేదు. వైద్య సేవలనగానే సిద్ధం అంటూ ముందడుగు వేసే నర్సింగ్ స్టాఫ్ కొకొల్లలు. అయినప్పటికీ ఖమ్మం జిల్లాలోని రోగుల ప్రాణాలకు గ్యారంటీ లేదు. కారణం..! తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యశాలలు నీరసించి పోయాయి. పాలేరు నుంచి పర్ణశాల వరకు కనీస వసతులు కనిపిస్తే ఒట్టు.. వాటి పట్ల కాంగ్రెస్ సర్కారు చూపిస్తున్న సవతి తల్లి ప్రేమ.. గత పదిహేను నెలలుగా నిధుల విడుదలలో జాప్యం కారణంగా ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారింది.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్‌కు జీవోలు జారీ చేసినప్పటికీ, వాటిని బయటికి పొక్కనివ్వకుండా ఆటలాడుకుంటున్న 'హస్తం' పాలకుల నిర్లక్ష్య వైఖరిపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

- ఖమ్మం, మార్చి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు నిల్
- అల్ట్రా స్కానింగ్, ఎక్స్‌రే విభాగాలకు దిక్కులేదు
- కీలకమైన వైద్య పరీక్షల కోసం ఖమ్మానికి పరుగు..
- సుదూర ప్రాంతాల్లో సర్జరీలు, పోస్టుమార్టం సేవలు
- చేతినిండా పనిలేక నీరసిస్తున్న సీనియర్ వైద్యులు
- వైరా 100 పడకల దవాఖానకు మోక్షమెప్పుడు..?
- మధిర, సత్తుపల్లి ఏరియా ఆసుపత్రులనూ పట్టించుకోరు..
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో పేదలు అష్టకష్టాలు

గాలిలో దీపంలా ప్రజారోగ్యం..!

ప్రారంభానికి నోచుకోని మధిర వంద పడకల ఆసుపత్రి

జిల్లాకో మెడికల్ కాలేజీ, ఊరికో పల్లె దవాఖాన, పట్టణ ప్రాంతాల్లో వాడకో బస్తీ దవాఖాన, కేసీఆర్ కిట్, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్, కండ్ల జబ్బుల నివారణకు కంటి వెలుగు, జిల్లా దవాఖానల్లో క్యాథ్‌లాబ్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, కిడ్నీ సంబంధిత సేవలు, న్యూరాలజీ విభాగాలు వంటి ఎన్నెన్నో కీలక సేవలు, పథకాలెన్నో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కనిపించేవి. తెలంగాణ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ సర్కారు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఒకనాడు వినిపించిన 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అనే మాటను పూర్తిగా తుడిచిపెట్టి 'నేను పోత బిడ్డో సర్కారు దవాఖానకు' అని రోగులు పరుగులు పెట్టేలా చేశారు. కానీ..! పదిహేను నెలలుగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే పాతరోజులు పునరావృతం అయినట్లుగా కనిపిస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో సరైన వసతులు కనిపించక, సేవలు లభించక నిరుపేదలు బిక్కుబిక్కుమంటూ బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. సామాన్యులకు జబ్బు చేస్తే దేవుడే దిక్కు అంటూ రోజులు లెక్కబెట్టుకునే దుస్థితి తలెత్తడం వైద్యవర్గాలను కలవరానికి గురి చేస్తున్నది.

వైద్యవిధాన పరిషత్‌లో ఏం జరిగింది..!

జిల్లాలో ఖమ్మంలోని పెద్దాసుపత్రితోపాటు మధిర, సత్తుపల్లి ఏరియా దవాఖానలు, వైరా, కల్లూరు, పెనుబల్లి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆసుపత్రులన్నీ తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉండేవి. వీటిల్లో ఎంతో అనుభవం కలిగిన స్పెషలిస్ట్ వైద్యులు(సివిల్ సర్జన్స్), నర్సింగ్ స్టాఫ్ నిరంతరం విధులు నిర్వహిస్తుండటం, గత బీఆర్ఎస్ సర్కారు నుంచి సంపూర్ణ సహకారం అందడంతో పేదలకు పండంటి ఆరోగ్యం లభించేంది. జిల్లా ప్రజల, వైద్య విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఖమ్మానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరిక మేరకు, మాజీ సీఎం కేసీఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. ఆ క్రమంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లింది. ఇక్కడ వైద్య విధాన పరిషత్ విభాగంలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ వైద్యులు కలిపి 20 నుంచి 30 మంది, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది దాదాపు 50 నుంచి 70 మంది వరకు బయటికి వెళ్లాల్సి వచ్చింది. ఆయా పరిస్థితులను ముందుగానే పసిగట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల సామర్థ్యానికి పెంచుతూ జీవో జారీ చేసింది. మధిర, సత్తుపల్లి ఆసుపత్రులను 100 పడకలకు పెంచుతూ ఏరియా దవాఖానలుగా ప్రకటించింది. తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కల్లూరు, పెనుబల్లి, కూసుమంచి, ముదిగొండ, ఎర్రుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది.

కనీస వసతుల్లేక తీవ్ర ఇక్కట్లు..

సరిగ్గా పద్నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. ముఖ్యంగా వైద్య విధాన పరిషత్ విభాగంపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. జిల్లాలోని కీలకమైన మధిర, సత్తుపల్లి ఏరియా దవాఖానల్లో అధునాతన వసతులతో కూడిన భవనాలను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించినప్పటికీ వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం విస్తుగొలుపుతున్నది. అదేవిధంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం తోపాటు ఆనాడే నిధులు మంజూరు చేసినప్పటికీ ఇసుమంత పురోగతి లేదు. ఈ ప్రాంత ప్రజలు కీలకమైన వైద్య పరీక్షలు, పోస్టుమార్టం కోసం ఖమ్మం లేదా మధిరకు వెళ్లాల్సి వస్తున్నది. తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, పెనుబల్లి ఆసుపత్రులు 50 పడకలతోపాటు 24 గంటలు పనిచేసే విధంగా రూపాంతరం చెందినా కనీస వసతుల్లేక రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఏ ఒక్క దవాఖానలోనూ అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే విభాగాలు లేవు. కీలకమైన వైద్య పరీక్షలకు పెద్దాసుపత్రికి చెందిన టీ హబ్ ఒక్కటే దిక్కుగా మారింది. వైద్య పరీక్షలకు అవసరమైన రీ ఏజెంట్స్ కెమికల్స్‌ను సైతం సరఫరా చేయలేకపోవడం హస్తం సర్కారు పని తీరుకు అద్దం పడుతున్నది. గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్, అనస్తీషియా, పాథాలజీ, పిడియాట్రిషన్ తదితర విభాగాలకు చెందిన వైద్యులున్నప్పటికీ వారి సేవలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్లు ఎక్కడా లేవు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులే లేవు..

మధిర, సత్తుపల్లి, వైరా, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, పెనుబల్లి ఆసుపత్రులను 24 గంటలు పనిచేసేలా అప్‌గ్రేడ్ చేశారు. వాటిల్లో విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టుల భర్తీ లేదు. ఆయా వైద్యాధికారులుంటేనే 24 గంటలపాటు ఆసుపత్రులు పనిచేసే వీలుంటుంది. అదేవిధంగా మినిస్టీరియల్ స్టాఫ్ నియామకంలోనూ అలసత్వమే కనిపిస్తున్నది. దవాఖానల్లో అనేక రకాల కీలక సమస్యలు కనిపిస్తున్నప్పటికీ, వాటి పరిష్కారం కోరుతూ పలు దఫాలుగా నివేదికలు సమర్పిస్తున్నా కాంగ్రెస్ సర్కారు బుట్ట దాఖలు చేస్తున్నదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. అదేవిధంగా జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ గాలిలో దీపంలా మారిన ప్రజారోగ్యాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు వచ్చిన ప్రతి సందర్భంలో వారివి మాటలు తప్ప కార్యాచరణ కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. 'మార్పు' అనే మాటను నమ్మి మాయలో పడ్డామని నిరుపేద రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాటలు తప్ప ఆచరణ ఇకనైనా వైద్యరంగం పట్ల దృష్టి సారించి తమ ప్రాణాలు కాపాడాలని సామాన్య ప్రజానీకం కోరుతున్నది.

ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడ..

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం, మార్చి 24 : ఖమ్మం నగరంలోని బీకే బజార్ మస్జీద్‌లో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థన చేశారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, కార్పొరేటర్ మక్బుల్, నాగండ్ల కోటేశ్వరరావు, తోట రామారావు, సోహైల్, ముజాహిద్, తోసిఫ్, పాషా, ఫిరోజ్, కపిల్ మున్న, చోటు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలి

- ఏప్రిల్ 1న జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మార్చి 24 : అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో కూడిన హామీలిచ్చారని, హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసినందుకు వారిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. సోమవారం మణుగూరు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదిగో.. అదిగో అంటూ డైవర్షన్ రాజకీయాలతో 15నెలల కాలం గడిపారని, ఇప్పుడేమో బడ్జెట్ సమావేశాల్లో తులం బంగారం ఇవ్వలేమని, రైతు రుణమాఫీ అయిపోయిందని, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేమని, కొత్త పింఛన్లు మాట ఎత్తవద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజు దగ్గర పడిందన్నారు. సంతకాలతో ఇచ్చిన గ్యారెంటీ కార్డు అందులో ఉన్న 13అంశాలను జోడించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11గంటలకు అన్ని పోలీస్‌స్టేషన్లలో సీఎం, డిప్యూటీ సీఎంలపై చీటింగ్ కేసులు పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని బీఆర్ఎస్ శ్రేణులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

20 శాతం పనులు పూర్తి చేయలేరా?

- గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పనులు పూర్తి
- సీతారామ ప్రాజెక్టు కాల్వల పరిశీలనలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి

సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి

జూలూరుపాడు/వైరాటౌన్, మార్చి 24 : సీతారామ ప్రాజెక్టు నిర్మాణం గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పూర్తయిందని, మిగతా 20 శాతం పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేరా? అని వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినోభానగర్ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ నుంచి ఏన్కూరు మండలంలోని సాగర్ కాల్వ వరకు చేపట్టిన లింక్ కెనాల్ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి కాక ముందే ఆర్భాటంగా సాగర్ కెనాల్‌కు నీటిని విడుదల చేసి రెండు రోజులు కాక ముందే నిలిపివేసిందని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తయిన పనులను కొనసాగించకుండా.. సాగర్ కెనాల్‌లో నీటిని కలిపేందుకు రూ.వంద కోట్లు కేటాయించి ఆ పనులపై దృష్టి సారించారే తప్ప పాత డిజైన్ ప్రకారం నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు ఎందుకు కేటాయించలేదని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి పక్షాన పోరాటాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్యా వినోద్‌కుమార్, ఇటుకల రాజు, షేక్ బాజీ, షేక్ చాంద్‌పాషా, భూక్యా ధర్మానాయక్, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాగొడ్డుగూడెంలో తాగునీటి కష్టాలు

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మూడు రోజులుగా నీటి సరఫరా బంద్

ట్యాంకర్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 24:మండలంలోని ఉట్లపల్లి పంచాయతీ వాగొడ్డుగూడెం గ్రామస్తులకు తాగునీటి మొదలయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో గ్రామంలో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. నిధుల లేమి కారణంగా పంచాయతీ అధికారులు కూడా మూడు రోజులుగా స్పందించలేదు. ప్రత్యామ్నాయంగా పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీళ్ల తెచ్చి వీధివీధికీ వెళ్తూ సరఫరా చేస్తున్నారు. అయితే, ఇలా ఇస్తున్న రెండుమూడు బిందెల నీళ్ల ఇంటి అవసరాలకు సరిపోవడం లేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు వీధుల్లో ఉన్న చేతిపంపుల వద్ద నుంచి బిందెలతో మోసుకొని తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉదయం నుంచి వ్యవసాయ పనులు చేసుకొని సాయంత్రానికి ఇంటికి చేరుకున్న తమను నీటి సమస్య వెంటాడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి మొదలై ఎండలు తీవ్రమవుతున్న ఈ సమయంలో దాహార్తి తీర్చుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల కన్నెర్ర

- హామీలను అమలు చేయాలని డిమాండ్
- తిరుమలాయపాలెంలో భారీ ప్రదర్శన, ధర్నా

తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

తిరుమలాయపాలెం, మార్చి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం పూర్తిఅయినా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు కన్నెర్ర చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామల నుంచి తరలివచ్చిన ప్రజలు సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని దిగ్బంధం చేసి ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. సుమారు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెంలో ఇండ్ల పట్టాలు ఇచ్చిన 130మందికి స్థలాలు చూపించాలని, డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, బషీరుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, అంగిరేకుల నర్సయ్య, తుళ్లూరి నాగేశ్వరరావు, దాసరి మహేందర్, దొండేటి సుగుణమ్మ, కొత్తపల్లి వెంకన్న, మంగతాయి పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, కొండబాల

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

మధిర (చింతకాని), మార్చి 24 : ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులు, వ్యవసాయ కూలీలను నట్టేట ముంచిందని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. సోమవారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు నివాసంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకోండి.. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలో ఇప్పటికే రుణమాఫీ చేశామని, ఇక చేసేది లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బోనకల్లు, చింతకాని, ముదిగొండ మండలాల్లో రైతులు వేలాది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, ఈ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని, ఇప్పుడు మాట మారుస్తున్నారని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతి రైతుకు ఎకరాకు రూ.15 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. మంత్రి తుమ్మల రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని చెప్పడంపై రైతాంగంలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే హామీల సాధన కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుడు మంకెన రమేశ్, పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, వేముల నర్సయ్య, జావీద్, మాజీ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణలో భాగస్వాములు కావాలి : డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న ఖమ్మం డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం సిటీ, మార్చి 24 : క్షయ వ్యాధి(టీబీ) నిర్మూలన ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి పిలుపునిచ్చారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సోమవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నివారణ గురించి వివరించారు. దీర్ఘకాలికంగా దగ్గు, ఆకలి మందగించడం, రాత్రిపూట చమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు మాట్లాడుతూ టీబీ రోగులకు ఆశా కార్యకర్తల సాయంతో మందులను ఉచితంగా ఇంటికే పంపిస్తామన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్‌లకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డాక్టర్లు బాబూ రత్నాకర్, కిరణ్, రామారావు, వెంకటరమణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలు, 'భోజన' కార్మికుల ముందస్తు అరెస్టు

కూసుమంచి పోలీసుల అదుపులో ఉన్న ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు

కూసుమంచి, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులను కూసుమంచి పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. మండలంలోని ప్రధాన సంఘం బాధ్యులను సైతం ఆదివారం రాత్రి ముందస్తుగా అదుపులోకి తీసుకొని వదిలేశారు. సోమవారం నాయకన్‌గూడెం వద్ద జిల్లా సరిహద్దు టోల్‌ప్లాజా వద్ద నుంచి వెళ్తున్న 50 మంది జిల్లాకు చెందిన ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులను అక్కడికక్కడే అరెస్టు చేశారు. వారిని కూసుమంచి ఎస్సై నాగరాజు, ట్రైనీ ఎస్సై దివ్యశ్రీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలేశారు.

'శిక్షణ'ను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

తుమ్మలచెరువు వద్ద బోటింగ్ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అశ్వాపురం, మార్చి 24 : యువత రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. సోమవారం మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ తుమ్మల చెరువులో ఏర్పాటు చేసిన రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ శిక్షణను సద్వినియోగం మరింతగా రాణించాలన్నారు. అనంతరం మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నెల్లిపాకలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రైతు మండ్రు సుధీర్ సాగు చేస్తున్న మునగ తోటను, మిట్టగూడెంలో పీఎం ఈజీపీ స్కీం ద్వారా కొర్సా దుర్గారావు నిర్వహిస్తున్న కొర్రమీను చేపల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మునగ తోటల పెంపకం, ఆక్వా కల్చర్ ద్వారా చేపల పెంపకం చేపట్టడం ద్వారా ప్రభుత్వ రాయితీ పొందడంతోపాటు లాభాలు గడించవచ్చని తెలిపారు. అలాగే హెవీ వాటర్ ప్లాంట్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఏపీవో సీతారామయ్య, ఏపీఎం సత్యనారాయణ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల నిరసన

వేతనాల కోసం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

రఘునాథపాలెం, మార్చి 24 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. మూడు నెలల వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జీపీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చానల్ ద్వారా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదన్నారు. ఉగాది పండుగకు జీతాలు చెల్లించకుంటే పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కార్మికుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ట్రెజరీలో పెండింగ్ ఉన్న వేతనాల చెక్కులు తక్షణమే ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధ